సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



నేత్రదానానికి ముందుకు రావాలి

నేత్రదానం సంప్రదాయంగా మారాలని నినదించారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా అగనంపూడిలో ర్యాలీ నిర్వహించారు.



సింహగిరిపై పవిత్రోత్సవాలు

సింహాచలం: సింహగిరిపై పవిత్రోత్సవాల్లో భాగంగా మూడవ రోజు గురువారం విశేషంగా హోమాలు, పారాయణాలు జరిగాయి.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉండి. తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి గురువారం తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 34.0 నుంచి 34.6 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 25.8 నుంచి 26.1 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

న్యూస్‌రీల్

సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు స్వాగతం



సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు స్వాగతం పలుకుతున్న న్యాయమూర్తులు

మహారాణిపేట: జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పి.ఎస్.నరసింహ గురువారం సాయంత్రం విశాఖ విమానాశ్రయం చేరుకున్నారు. వీరికి జిల్లా సెషన్స్ జడ్జి చిన్నంశెట్టి రాజు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పలువురు న్యాయమూర్తులు స్వాగతం పలికారు. వారంతా ఉదయం 09.30 గంటలకు రాడిసన్ బ్లూలో జరిగే ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లోను, ఉదయం 11.30 గంటలకు నొవోటెల్ హోటల్‌లో జరిగే దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అక్కడ జరిగే నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ సమావేశంలో పాల్గొంటారు.

ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం

- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు




దేవరాపల్లి: రాష్ట్రంలో రైతులకు సకాలంలో ఎరువులు సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. దేవరాపల్లి మండలం తారువలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా సీజన్ ప్రారంభంలోనే అవసరమైన ఎరువుల సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతుల పాలిట శాపంగా మారిందని ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కోసం రైతులు గంటల తరబడి భారీ క్యూలైన్లో నిరీక్షించాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుకు అవసరమైన యూరియాను పుష్కలంగా సరఫరా చేశామన్నారు. రోజంతా పనులు మానుకొని పడిగాపులు కాస్తే ఎంత విస్తీర్ణం ఉన్నా, బస్తా యూరియా ఇస్తుండటం దారుణమన్నారు. రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తూ పోరాడుతుండటంతో కూటమి ప్రభుత్వం ఇప్పుడు పరుగులు పెడుతుందని, ముందుగా ప్రణాళిక బద్ధంగా వ్యవహరించి ఉంటే ఇబ్బందులు తప్పేవని తీవ్రంగా మండిపడ్డారు.

ఈ ఉద్యోగం నాకొద్దు బాబోయ్

- దీర్ఘకాలిక సెలవులో అనకాపల్లి తహసీల్దార్
- అధికారులపై పెరుగుతున్న రాజకీయ పెత్తనం
- నిబంధనలకు విరుద్ధంగా తాము చెప్పిందే చేయాలంటున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు
- ఒత్తిళ్లు తట్టుకోలేక సెలవుపై వెళ్లిన తహసీల్దార్

రాజకీయ పెత్తనం పెరగడంతో అధికారులు తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వహించడానికి భయపడుతున్నారు. ఒత్తిళ్లు భరించలేక బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారు. మ్యుటేషన్లు, పట్టాదారు పాస్ పుస్తకాలు తాను చెప్పినట్టు జారీ చేయాలని ఒక మాజీ ఎమ్మెల్యే.. రోడ్డు విస్తరణ నిర్వాసితుల్లో తాను చెప్పిన పేర్లు చేర్చమని మరో మాజీ ఎమ్మెల్యే బలవంతపెట్టడంతో నిబంధనలకు విరుద్ధంగా ఈ పనులు చేయలేక అనకాపల్లి తహసీల్దార్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు.



సాక్షి, అనకాపల్లి:

అది సాక్షాత్తూ కలెక్టర్ కొలువుదీరిన **జిల్లా కేంద్రం**.. తమ సిబ్బంది సాధకబాధకాలు **ప్రత్యక్షంగా** కనిపించడంతో జిల్లా అధికారులు సా**నుకూలంగా** స్పందించడం, అండగా నిలవడం సర్వ**సాధారణం**. కానీ అనకాపల్లిలో మాత్రం తహసీల్దా**ర్ అంతటి** అధికారి ఒత్తిళ్లు భరించలేక సెలవును **ఆశ్రయిం**చాల్సి వచ్చింది. ఇది కూటమి **ప్రభుత్వంలో** రెవెన్యూ అధికారులపై రాజకీయ పెత్త**నం పెరిగిం**దనడానికి తాజా ఉదాహరణ. జిల్లా**లో గతంలో** ఎన్నడూ లేని విధంగా బెదిరింపులకు పాల్పడుతూ టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ శాఖలో వివాదస్పదమైన భూ లిటిగేషన్ పట్టాదారు పాస్ పుస్తకాలు, మ్యుటేషన్లకు సంబంధించి అక్రమాలకు సహకరించడం లేదంటూ నేరుగా తహసీల్దార్‌పైనే టీడీపీ నేతలు విరుచుకుపడుతున్నారు. తాను చెప్పిన ఈ పనులు చేయాలని అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే తహసీల్దార్‌పై ఇటీవల రెండు వారాలుగా తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా చేస్తే తన ఉద్యోగానికి ఇబ్బంది అవుతుందని, చేయలేనని తహసీల్దార్ అప్పారావు చెప్పినట్టు **తెలిసింది. దీనికి ఆ మాజీ ఎమ్మెల్యే ఆగ్రహంతో ఊగిపోయి నానా దుర్భాషలాడారు. ప్రస్తుతం** విశాఖ టీడీపీలో జిల్లా స్థాయి పదవిని అనుభవిస్తున్న పెందుర్తి నియోజకవర్గానికి చెందిన మరో మాజీ ఎమ్మెల్యే కూడా అనకాపల్లి తహసీల్దార్‌పై మరో విషయంలో ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. అనకాపల్లి మండలంలోని కోడూరు గ్రామంలో లేఅవుట్ నెం.4కు సంబంధించి 100 అడుగుల రోడ్డు విస్తరణ జరుగుతోంది. భూములు కోల్పోయిన లబ్ధిదారుల జాబితాలో తాను సిఫార్సు చేసిన వారి పేర్లు పొందుపరచాలని మాజీ ఎమ్మెల్యే హుకుం జారీ చేశారు. దీనికి నిబంధనలకు అనుగుణంగా ఉంటే చేస్తామని లేదంటే కుదరదని తహసీల్దార్ తేల్చిచెప్పారు. గతంలో సర్వే నెంబర్.20లో ఇలానే **జరిగిందని, మీరెందుకు ఇవ్వరంటూ ప్రశ్నించి.. మాజీ ఎమ్మెల్యే ఆగ్రహంతో ఊగిపోయి 'నీ అంతు** చూస్తా.. చేయలేకపోతే సెలవు పెట్టేసి వెళ్లిపో' అంటూ భయభ్రాంతులకు గురిచేశారు. దీనికి కలత చెందిన తహసీల్దార్ అప్పారావు సన్నిహితుల వద్ద బోరున విలపించినట్టు సమాచారం. ఎందుకొచ్చిన గొడవ.. రావడమే భయంతో వచ్చాను.. ఇక్కడ నుంచి పోవడం శ్రేయస్కరమని ఆయన సెలవు పెట్టేసి వెళ్లిపోయినట్లు రెవెన్యూ అధికారుల చర్చించుకుంటున్నారు.

41 రోజుల నరకం

తహసీల్దార్ ఎం.బి.అప్పారావును జూన్ నెల 6వ తేదీన అనకాపల్లికి బదిలీ చేశారు. అనకాపల్లిలో విధులు నిర్వహించడం కష్టమని భావించిన అప్పా**రావు విధుల్లో చేరకుండా 37 రోజులపాటు నిరీక్షించి తప్పనిసరి పరిస్థితుల్లో జూలై 17న బాధ్యతలు** స్వీకరించారు. 41 రోజుల పాటు పనిచేసిన అప్పారావు అధికార టీడీపీ చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల హూంకరింపులు, బెదిరింపులు తట్టుకోలేక ఆగస్టు 28న నెలరోజుల పాటు దీర్ఘకాలిక సెలవు పెట్టారు.

అందరికీ హడలే..

అనకాపల్లిలో నెల రోజుల క్రితం డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి నియమితులై.. బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే పదోన్నతిపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి నెల రోజులపాటు డిప్యూటీ తహసీల్దార్ లేరు. ఆ పోస్టు ఖాళీగా ఉండగానే ఆగస్టు 28న తహసీల్దార్ కూడా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపో**యారు. అనకాపల్లి తహసీల్దార్** కార్యాల**యమంతా ఖాళీ అయిపోయింది.** సమస్యలపై **వచ్చిన వారు సమస్య తీరకుండానే** వెనుదిరు**గుతున్నారు. ఈ నెల 2వ తేదీన** కొత్త డిప్యూటీ **తహసీల్దార్‌ను నియమించారు.** కానీ ఇప్పటికీ **పూర్తిస్థాయి తహసీల్దార్‌ను** నియమించలేదు. **భూ సమస్యలు, రికార్డ్ ఆఫ్ రైట్స్** కాపీలు, **పాసుబుక్‌లు, కుల, ఆదాయ, వార**సత్వ ధ్రువీక**రణ పత్రాలు ఇవ్వడంలో ఆటంకాలు** ఏర్పడ్డాయి. కొత్త భూ సర్వేలకు సంబంధించి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ అనంతరం మ్యుటేషన్ ప్రక్రియ ఆగిపోయింది. పూర్తిస్థాయి ఎమ్మార్వో లేకపోవడంతో పెండింగ్‌లో పెట్టేస్తున్నారు. ఇక కింది స్థాయి ఉద్యోగులు తమకెందుకు రిస్క్ అంటూ గమ్మున ఉంటున్నారు. పాయకరావుపేట డీటీ ఇక్కడకు బదిలీపై వచ్చినప్పటికీ ఆయన కూడా లోలోపల భయం భయంగానే పనిచేస్తున్నారు. కింది స్థాయి అధికారులు, ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యం నింపాల్సిన ఉన్నతాధికారులు మౌనంగా చూసీ చూడనట్టు వ్యవహరించడం తగదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రక్త కన్నీరు

- స్కూలు ఆటో బోల్తాపడి బాలుడు మృతి
- గర్భశోకంతో తల్లడిల్లిన తల్లిదండ్రులు
- గాయాలతో బయటపడిన మృతుడి సోదరి



విలపిస్తున్న తల్లిని ఓదారుస్తున్న బంధువులు



విగత జీవిగా ఉన్న కుమారుడిని చూసి తండ్రి ఆవేదన (ఇన్‌సెట్) ఆకాష్ (ఫైల్)



అన్నను పోగొట్టుకున్న బాధలో అనీష

అనకాపల్లి టౌన్: స్కూల్లో టీచర్స్ డే వేడుకలు.. ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు చెప్పడానికి పూలు తీసుకొని బయల్దేరారు ఆకాష్, అనీష. వారిద్దరూ కవల పిల్లలు. తాను టీచర్ వేషం వేస్తానని చీర కట్టుకొని తయారైంది అనీష. తాము చదువుతున్న ఏఎంఏఎ హైస్కూల్‌కు ఆటోలో బయలుదేరారు. కొద్ది నిమిషాల్లోనే విధి వక్రించింది. మార్గం మధ్యలో కృష్ణాపురం వద్ద పంది అడ్డం రావడంతో ఆటో డ్రైవర్‌కు స్టీరింగ్ కంట్రోల్ తప్పింది. వారి వాహనం బోల్తా పడి ఆటోలో ఉన్న ఆకాష్ (14) అక్కడిక్కడే మృతి చెందగా, చెల్లెలు అనీష కాలికి తీవ్ర గాయమయింది. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన అనీషాను వెంటనే ఎన్టీఆర్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అన్న చెల్లెలు ఇద్దరూ తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఆకాష్ తండ్రి స్థానిక జేఎంజే హైస్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నారు. కోటి ఆశలకు ఆలంబనగా ఉన్న తమ కుమారుడిని విగత జీవిగా చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

ఆకాష్ కళ్లు సజీవం

అంత దుఃఖంలోనూ ఆకాష్ తల్లిదండ్రులు ఆదర్శంగా నిలిచారు. తమ కుమారుడి నేత్రాలను దానం చేశారు. ఒకపక్క కన్నీరు మున్నీరవుతూనే బాధ్యతగా ఆలోచించారు. తమ చిన్నారి మరణించినా కళ్లను సజీవంగా నిలిపారు.

చుట్టుపక్కల గ్రామస్తుల ఆందోళన

పంది ఆటోకు అడ్డంగా రావడంతో ప్రమాదం జరిగిన నేపథ్యంలో మృతుని స్వగ్రామమైన రామాపురం చుట్టుపక్కల గ్రామస్తులు ఆగ్రహంతో ఊగిపోయారు. విచ్చలవిడిగా తిరుగుతున్న పందులే ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆగ్రహిస్తూ రామాపురం రోడ్‌పై బైఠాయించి నిరసన తెలిపారు.

ఏసీబీ వలలో వీఆర్వో




వివరాలు వెల్లడిస్తున్న విశాఖ రేంజ్ ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన వీఆర్వో సూర్యకృష్ణ పృథ్వీ

- రైతు నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత

కొత్తకోట: భూమి బదిలీ (మ్యుటేషన్) కోసం రైతు నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటూ వీఆర్వో గన్నమరాజు సూర్యకృష్ణ పృథ్వీ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. విశాఖ రేంజి ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తకోట మండలం జెట్టపురెడ్డితుని శివారు నరసింగబిల్లికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు తమ తల్లి పేరిట ఉన్న 2.10 ఎకరాల భూమిని తమ పేరిట బదిలీ చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని గత నెలలో దరఖాస్తు చేశారు. రైతు ఊడి నాగేశ్వరరావు చేసిన ఈ దరఖాస్తును పరిశీలించిన వీఆర్వో గన్నమరాజు సూర్యకృష్ణ పృథ్వీ రూ.40 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేమని నాగేశ్వరరావు చెప్పగా.. చివరకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు విశాఖ రేంజి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రైతు నుంచి వీఆర్వో రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. వీఆర్వోను అరెస్టు చేశామని, శుక్రవారం అతడిని విశాఖ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.



ఉత్తమ అధ్యాపకుడిగా వడ్డాది ప్రిన్సిపాల్



చిన్నారావు

నర్సీపట్నం/బుచ్చెయ్యపేట: వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.చిన్నారావు రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడు పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులలో ప్రిన్సిపాల్ చిన్నారావు ఉన్నారు. నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకులుగా ఆయన గతంలో సేవలందించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కూడా పనిచేశారు. ఇటీవల పదోన్నతిపై వడ్డాది జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఇంగ్లిష్‌లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేశారు. విద్యార్థులు స్టేట్ అవార్డులు సాధించడానికి తర్ఫీదు ఇచ్చారు. ఆయన కృషికి ఫలితంగా ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపికయ్యారు.

దయా మాధురికి బెస్ట్ మెంటార్ అవార్డు



అనకాపల్లి టౌన్: భారత ప్రభుత్వ రంగ సంస్థ సీఎసీ టీచర్స్ డే సందర్భంగా అందించే నేషనల్ టీచర్స్ డే అవార్డుల్లో భాగంగా బెస్ట్ మెంటార్ అవార్డుకు దాడి వీరునాయుడు కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.దయా మాధురిని ఎంపిక చేశారు. ఉత్తమ ప్రమాణాలతో విద్యార్థులకు మార్గదర్శనం చేస్తునందుకు ఈ అవార్డుకు ఆమె ఎంపికైనట్లుగా ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ తెలిపారు.

చదివిన చోటే బోధకుడిగా..

- 114 ఏళ్ల చరిత్ర కలిగిన పాఠశాల అభివృద్ధికి బాటలు
- స్వచ్ఛంద సంస్థల సహకారంతో సేవా కార్యక్రమాలు
- మాడుగుల మాస్టార్ నాగ వెంకట దేవి సూర్యనారాయణ ఆదర్శం

మాడుగుల మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల





విద్యార్థులకు పాఠాలు చెబుతున్న సూర్యనారాయణ మాస్టారు

మాడుగుల రూరల్: ఉన్నత స్థాయిలో స్థిరపడిన తర్వాత మనం చదువుకున్న పాఠశాలలో అడుగుపెడితే ఒక్కసారిగా రెక్కలు వచ్చిన పక్షిలా బాల్య జ్ఞాపకాల్లోకి వెళ్లిపోతాం. ఆనాటి అనుభూతులు ఎన్నెన్నో కళ్ల ముందు కదలాడుతుంటాయి. అప్పుడు పొందే ఆనందం వర్ణనాతీతం. ఇక్కడే ఉండిపోతే ఎంతో బాగుణ్ను అనిపిస్తుంది. అదే అక్కడే పనిచేసే అవకాశం లభిస్తే ఎగిరి గంతేస్తాం.. అటువంటి అరుదైన అవకాశం పొందిన మాడుగులకు చెందిన సిరిపిల్లి నాగ వెంకట దేవి సూర్యనారాయణ మాస్టారు తాను చదువుకున్న పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయుడిగా అడుగుపెట్టారు. ఆయన 1998 డీఎస్సీలో ఎంపికై హుకుంపేట మండలం బంగారుమెట్టలో ఉపాధ్యాయ వృత్తి ప్రారంభించారు. ప్రస్తుతం మాడుగుల నడిబొడ్డున 114 సంవత్సరాలు చరిత్ర కలిగిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (గెడ్డబడి) విధులు నిర్వహిస్తున్నారు.

అభివృద్ధి బాటలో పాఠశాల

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (గెడ్డబడి)లో 2021 జనవరి 16న హెచ్ఎంగా చేరిన నాటికి ఇక్కడ 34 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. ఆయన కృషితో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 144కు పెరిగింది. ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఆయన చొరవతో పాఠశాలను వాసవీ క్లబ్ దత్తత తీసుకుంది. ఆరోహణ ట్రైబుల్ వెల్ఫేర్ సొసైటీ, మన్యం జ్యోతి సేవా సంఘం, భారత నిర్మాణ సేవా ట్రస్టు వంటి స్వచ్ఛంద సంస్థల సహకారంతో అభివృద్ధి చేశారు. ఈ ఏడాది జూన్ 12 వరకు హెచ్ఎంగా చేసిన ఆయన ప్రస్తుతం ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు. అదేవిధంగా గతంలో సాగరం కాలనీ ఎంపీపీ పాఠశాలల్లో పనిచేసేటప్పుడు హెల్పింగ్ హ్యాండ్ సంస్థ సహకారంతో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు, పాలు వంటివి పంపిణీ చేయించారు. చింతలూరు పాఠశాలలో అక్కడ క్వారీ యాజమాన్యం సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

2019లో చింతలూరు పాఠశాలలో పనిచేసేటప్పుడు ఆయనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. వీరనారాయణం పాఠశాలలో పనిచేసేటప్పుడు మండల స్థాయి అవార్డు పొందారు. తన బోధన, బోధనేతర కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచారు.

ఉపమాక వెంకన్న ఆభరణాలు భద్రం



రుషికొండ ఆలయంలో ఆభరణాలను లెక్కిస్తున్న టీటీడీ ఇన్వెంటరీ సిబ్బంది

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆభరణాలు భద్రంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. స్వామి వారికి వెలకట్టలేని వజ్రవైఢూర్యాలు, స్వర్ణాభరణాలు, వెండి ఆభరణాలు ఉన్నాయి. వీటిని భద్రతా కారణాల రీత్యా విశాఖ సబ్ ట్రెజరీలో ఉంచారు. ఏటా వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం టీటీడీ చీఫ్ అకౌంట్ ఆఫీసరు వెంకటరమణ ఇన్వెంటరీ సూపరింటెండెంట్ ముని చెంగలరాయుడుల ఆధ్వర్యంలో టీటీడీ ఇన్వెంటరీ సిబ్బంది రుషికొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి ఆభరణాలను లెక్కించారు. సబ్ ట్రెజరీల్లో భద్రపరచిన ఆభరణాల ప్రాప్తికి రికార్డుల ప్రకారం ఉన్నాయా అనేది ఆడిట్ నిర్వహించారు. అన్ని ఆభరణాలను పూర్తిగా పరిశీలించి జీఎస్టీతో కూడిన రశీదు, ధర్మకాటా రశీదులతోపాటు, దాతలు స్వామివారికి సమర్పించే ఆభరణాలకు సంబంధించి ముందుగానే తగిన వివరాలను తెలియజేస్తూ లేఖను సమర్పించాల్సి ఉంటుందని ఇన్వెంటరీ అధికారులు చెప్పారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆడిటర్ వై గురు ప్రసాద్, రుషికొండ దేవస్థానం ఏవో ఎస్ జగన్మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ, అప్రైజర్ ఎన్ మునిశేఖరాచారి, ఉపమాక దేవస్థానం ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, దేవస్థాన ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

నేడు గురు పూజోత్సవం



గురుపూజోత్సవ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గుండాలవీధి ఎస్.ఆర్. శంకరన్ హాల్‌లో జిల్లా స్థాయి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. మండలంలోని కొప్పాక జెడ్పీ పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ నిర్వహణ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ విజయ కృష్ణన్ అధ్యక్షతన జరిగే సమావేశంలో స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొంటారని, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. అనంతరం గురుపూజోత్సవ కార్యక్రమాల బ్రోచర్‌ను విడుదల చేశారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి పొన్నాడ అప్పారావు, సహాయ కమిషనర్ శ్రీధర్ రెడ్డి, సత్యనారాయణ, రామలింగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

దోసగింజలపై 'నూటికో కోటికో' గేయం



మాకవరపాలెం: తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ దోస గింజలపై 'విశ్వరూపం' చిత్రంలోని 'నూటికో కోటికో ఒక్కరు' గేయాన్ని లిఖించాడు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని 290 దోస గింజలపై గేయాన్ని రాశానని తెలిపాడు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరికీ టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపాడు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులే జీవిత మార్గదర్శకులు


సర్వేపల్లి రాధాకృష్ణన్ మనుమడు, సుదీక్ష గ్రూప్ సీఎండీ సుబ్రహ్మణ్య శర్మ

అనకాపల్లి టౌన్: ప్రతి విద్యార్థి తమ ఉపాధ్యాయులను జీవిత మార్గదర్శకులుగా చూడాలని దివంగత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ మనుమడు, సుదీక్ష గ్రూప్ సీఎండీ డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గురువు చూపే దారే సరైన గమ్యం అనే భావన ఉండాలన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నుంచి జ్ఞానం, దేశ సేవ వంటి ఆదర్శాలు మనకు ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తాయన్నారు. రాధాకృష్ణన్ తమ కుటుంబానికే కాకుండా దేశానికే గర్వకారణంగా నిలిచారన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవంలో అప్రమత్తత అవసరం


ఎస్పీ కార్యాలయంలో వినాయకునికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జిల్లాలో జరుగుతున్నాయని, గణేష్ నిమజ్జన సమయంలో కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుహిన్ సిన్హా కోరారు. ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఆయన గురువారం ప్రత్యేక పూజలు చేసి, అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవో సీహెచ్. తిలక్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు టి.లక్ష్మి, లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, మన్మధరావు, పోలీస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అచ్చెన్న చెరువు మట్టిపై 'కూటమి' కన్ను..!


యర్రవరం అచ్చెన్న చెరువులో మట్టి తవ్వకాలు


ప్రైవేట్ ప్రదేశాల్లో ఫిల్లింగ్ చేస్తున్న చెరువు మట్టి

- అనుమతులకు విరుద్ధంగా యథేచ్ఛగా తరలింపు
- ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వైనం

అచ్యుతాపురం రూరల్: యర్రవరం పంచాయతీలోని అచ్చెన్న చెరువులో మట్టిపై కూటమి నాయకుల కన్ను పడింది. సర్వే నంబరు 147లోని సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో మట్టిని యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పట్టపగలే భారీ టిప్పర్లు, పొక్లెయిన్ల సహాయంతో ప్రభుత్వ చెరువులో మట్టిని తవ్వి తరలించుకుపోతున్నారు. సమీప పొలాల్లో భూమిని ఎత్తు చేసుకోవడానికని చెప్పి చెరువులో మట్టి తవ్వకాలకు అనుమతి తీసుకుని కొల్లగొడుతున్నారు. గురువారం ఈ చెరువు నుంచి మట్టిని తీసుకెళ్లి కొండకర్ల ఆవకు సమీపంలోని ఓ ప్రైవేట్ స్థలంలో ఫిల్లింగ్ చేయడంపై స్థానిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టపగలే భారీ టిప్పర్లతో ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలో నిర్మిస్తున్న పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, ప్రైవేట్ లేఅవుట్లు ఎత్తు చేసుకోవడానికి మట్టిని తరలించి అక్రమ ధనార్జన చేస్తున్నారని మండిపడ్డారు. అధికార కూటమి నాయకులు అధికారులను తమ గుప్పెట్లో పెట్టుకుని గ్రామంలోని సహజ వనరులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కక్ష సాధింపు మొదలు..

చెరువులో మట్టి తరలింపు విషయాన్ని ప్రశ్నిస్తున్న గ్రామస్తులపై అధికారం అండతో కక్ష సాధింపు చర్యలు మొదలయ్యాయి. యర్రవరానికి చెందిన కొల్లేటి చిన్నారావు గ్రామంలో టీషాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. గ్రామం నుంచి అక్రమంగా తరలిపోతున్న మట్టి కారణంగా గ్రామానికి హాని కలుగుతుందన్న ఆవేదనతో ఆయన అడ్డుచెప్పారు. దీంతో చిన్నారావుపై కక్ష గట్టారు. టీ షాపు రోడ్డు మీదకు వచ్చిందని, తొలగించాలంటూ రెవెన్యూ సిబ్బందితో బెదిరింపులకు పాల్పడ్డారు. మట్టి బయటకు తరలించుకుపోవడంతో చుట్టు పక్కల ఉన్న తమ గ్రామానికి చెందిన భూములను అభివృద్ధి చేసుకోవడానికి మట్టి దొరక్క రైతులు ఇబ్బందులకు గురవుతారని చిన్నారావు ఆవేదన వ్యక్తం చేశారు.

సంబంధిత అధికారులు స్పందించి చెరువు మట్టి అక్రమ తరలింపులో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈ విషయమై నీటి పారుదల శాఖ డీఈ సాయి ప్రశాంతిని వివరణ కోరగా కేవలం పొలాల్లో భూమిని ఎత్తు చేసుకోవడానికి అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి పొందిన అనుమతికి, చేస్తున్న పనికి వ్యత్యాసం ఉండడంతో విచారణ చేపడతామన్నారు.

చోడవరంలో వైభవంగా ముగిసిన నవరాత్రి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరస్వామి

చోడవరం: స్వయంభూ పుణ్య క్షేత్రాల్లో కాణిపాకం తర్వాత ఒకటైన చోడవరం శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు సంబరంగా సాగాయి. గురువారం ముగింపు రోజున స్వామిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయంతో పాటు స్వామివారిని, గర్భగుడి ప్రాంగణాన్ని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వెండి, బంగారు ఆభరణాలు, సుగంధ పుష్పాల అలంకరణలో స్వామి కనువిందుగా దర్శనమిచ్చారు.

ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. అనంతరం పండిత ఆశీర్వచనం, లడ్డూ వేలం నిర్వహించారు. రాత్రి నిర్వహించిన స్వామి వారికి తిరువీధోత్సవం కనుల పండువగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన మూషిక వాహనంపై ఉత్సవ మూర్తులను ఉంచి ఊరేగించారు. ఎమ్మెల్యే రాజు, ట్రస్ట్ బోర్డు కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబశివరావు, దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

అనకాపల్లికి చేరుకున్న ఆటోడ్రైవర్ పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న ఆటో డ్రైవర్ చింతకాయల శ్రీనుకు సంఘీభావం తెలియజేస్తున్న ఆటో డ్రైవర్లు

అనకాపల్లి: స్త్రీశక్తి పథకంలో భాగంగా మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్ చింతకాయల శ్రీను ఈ నెల 2న విశాఖ నుంచి విజయవాడకు తలపెట్టిన పాదయాత్ర గురువారం స్థానిక నెహ్రూచౌక్‌కు చేరుకుంది. ఆయనకు ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పెదిరెడ్ల నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు కోన లక్ష్మణ సంఘీభావం తెలియజేశారు. పాదయాత్ర ఈ నెల 20న విజయవాడ చేరుకుంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోరిబిల్లి జగదీష్, సహాయ కార్యదర్శి సూరిశెట్టి బాబునాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

యూరియా సమస్యలపై కంట్రోల్ విభాగాల ఏర్పాటు

- రైతులకు సరిపడా యూరియా సిద్ధం: కలెక్టర్

తుమ్మపాల: జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 895.11 మెట్రిక్ టన్నుల యూరియా మార్క్‌ఫెడ్, ప్రైవేట్ డీలర్స్, సొసైటీలు, రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో ఉందన్నారు. రానున్న 10 రోజుల్లో మరో 1,500 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని చెప్పారు. రైతులు తప్పనిసరిగా తమ వేలిముద్రలు నమోదు చేసుకుని ఆధార్ అధీకృత విధానం ద్వారా యూరియా కొనుగోలు చెయ్యాలని, అధికంగా ఎరువులను వినియోగిస్తే, దోమపోటు పొడతెగులు వంటి చీడ పీడల ఉధృతి పెరిగే అవకాశం ఉందని, నిర్దేశించిన మోతాదు లోనే యూరియాను వినియోగించాలని సూచించారు. అధిక ధరలకు యూరియా అమ్మితే సమీపంలో ఉన్న మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. యూరియా సమస్యలపై రైతులు ఫోన్ నెం .8331056471తో జిల్లా కార్యాలయంలో కంట్రోల్ విభాగం ఏర్పాటు చేశామన్నారు.

సబ్ డివిజన్ వారీగా కంట్రోల్ విభాగం ఫోన్ నంబర్లు

అనకాపల్లి డివిజన్ - 8331056383,
చోడవరం డివిజన్ - 8331056402,
నర్సీపట్నం డివిజన్ - 8331056410,
ఎల్లమంచిలి డివిజన్ -8331056389,
పాయకరావుపేట డివిజన్ -8331056395

దేవరాపల్లిలో యూరియా పంపిణీపై ఆరా తీసిన డీఏవో, ఆర్డీవో


దేవరాపల్లి రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీపై విచారణ చేపడుతున్న డీఏవో మోహన్‌రావు, ఆర్డీవో ఆయిషా

దేవరాపల్లి: యూరియా కోసం రైతులు గంటల కొద్దీ నిరీక్షించి తీవ్ర ఇబ్బందులు పడ్డారని పత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా కలెక్టర్ స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు, అనకాపల్లి ఆర్డీవో ఆయిషా దేవరాపల్లిలో గురువారం పర్యటించారు. దేవరాపల్లి రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీపై స్థానిక వ్యవసాయ అధికారి, సిబ్బందిని ఆరా తీశారు. ఎరువుల పంపిణీకి సంబంధించిన రికార్డులను, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు మాట్లాడుతూ దేవరాపల్లి మండలంలో సుమారు 10 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి నాట్లు పూర్తయ్యాయని, ఇప్పటి వరకు 540 మెట్రిక్ టన్నులు యూరియా అందించామన్నారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికార్ల పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేస్తామని, యూరియా స్టాక్ పాయింట్ వద్ద రెవెన్యూ సిబ్బందిని ఉంచుతామన్నారు. వీరి వెంట మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి, తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ, ఏఈవో ఎస్.కిరణ్‌కుమార్ తదితర అధికార్లు, సిబ్బంది ఉన్నారు.

బుచ్చెయ్యపేటలో డెంగ్యూతో మహిళ మృతి

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం బుచ్చెయ్యపేటకు చెందిన ధనంరెడ్డి హైమ(43) డెంగ్యూ జ్వరంతో మృతి చెందింది. గ్రామంలో టీ దుకాణం నడుపుకొని జీవించేది. వారం రోజులుగా ఆమెకు జ్వరం రావడంతో గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడి దగ్గర వైద్య సేవలు పొందింది. జ్వరం తగ్గకపోవడంతో విశాఖ కృషి ఆసుపత్రి, అక్కడ నుంచి గాజువాకలోని మరో ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ గురువారం మృతి చెందింది. ఈమెకు జ్వరంతో పాటు పచ్చకామెర్లు, కిడ్నీలు పాడై ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు భర్త జల్లేశ్వరరావుతో పాటు ఇద్దరు కుమారులున్నారు.

మేయర్‌పై గరం.. గరం

- పీలా వ్యవహారంపై సొంత పార్టీ కార్పొరేటర్ల అసంతృప్తి
- నిబంధనలు పక్కన పెట్టి స్టాండింగ్ కమిటీ సమావేశం
- పలు అంశాలపై నిలదీసిన సభ్యులు



పలు అంశాలపై వివరణ కోరుతున్న స్థాయీ సభ్యురాలు సాడి పద్మారెడ్డి

డాబాగార్డెన్స్: నగర మేయర్ పీలా శ్రీనివాసరావు వ్యవహారశైలిపై సొంత పార్టీ కార్పొరేటర్లే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఆయన వ్యవహరిస్తున్నారని, అధికారులతోనూ సమన్వయం పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. దీనికి నిదర్శనంగా గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని చూపుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ చట్టం సెక్షన్ 97ఏ ప్రకారం కొత్తగా ఏర్పాటైన స్టాండింగ్ కమిటీ తొలి సమావేశం కమిషనర్ నిర్ణయం ప్రకారం నిర్వహించాలి. కానీ మేయర్ కార్యాలయం ఈ నిబంధనను పక్కనపెట్టి, కార్యదర్శి సంతకంతో ఒకరోజు ముందు మాత్రమే అజెండాను సభ్యులకు పంపింది. దీనివల్ల అజెండాలోని అంశాలను పరిశీలించడానికి తగినంత సమయం దొరకలేదని సభ్యులు మండిపడుతున్నారు. మేయర్ ఒంటెద్దు పోకడతో వ్యవహరిస్తున్నారని, ఇది మంచిది కాదని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

కమిషనర్‌కు వినతి: పైన పేర్కొన్న విషయమై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్, జీవీఎంసీ స్థాయీ సంఘం సభ్యురాలు సాడి పద్మారెడ్డి మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతి పత్రం అందజేశారు. సమావేశ నోటీసు రద్దు చేయాలని, స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిబంధనల ప్రకారం కచ్చితంగా నిర్వహించాలని ఆమె అభ్యర్థించారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం: స్థాయీ సంఘం సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. 198 అంశాలు అజెండాలో పొందుపరచగా, సభ్యులు చర్చించిన అనంతరం 194 అంశాలు ఆమోదించారు. 4 అంశాలు వాయిదా వేశారు. సమావేశంలో సభ్యులు కొణతాల నీలిమ, గంకల కవిత, దాడి వేంకటరామేశ్వరరావు, మొల్లి హేమలత, సేనాపతి వసంత, గేదెల లావణ్య, మాదంశెట్టి చిన్నతల్లి, రాపర్తి త్రివేణి వరప్రసాదరావు, మొల్లి ముత్యాలు, సాడి పద్మారెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

ఇలా అయితే ర్యాంకు వెళ్లిపోవడం ఖాయం

పారిశుధ్య నిర్వహణపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2025–26 సంవత్సరానికి 49.66 లక్షల అంచనా వ్యయంతో కొబ్బరి చీపుర్ల కొనుగోలు ప్రతిపాదన చర్చకు వచ్చినప్పుడు సభ్యులు అధికారులను నిలదీశారు. సభ్యురాలు సాడి పద్మారెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు చీపుర్లు వంటి ఉపకరణాలు అందజేసే ముందు స్థానిక కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరో సభ్యుడు రాపర్తి త్రివేణి వరప్రసాదరావు మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని విమర్శించారు. స్వచ్ఛ భారత్ ర్యాంకింగ్‌లో జీవీఎంసీ 9వ ర్యాంకుకు పడిపోయిందని గుర్తు చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాది ర్యాంకు 90కి పడిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు.

ఈ అంశాన్ని దాట వేశారు..

ఏయూ ప్రాంగణాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ కోసం ప్రైవేట్ కార్మికులకు చెల్లింపుల అంశంపై స్టాండింగ్ కమిటీలో చర్చ జరిగింది. ఈ అంశాన్ని సభ్యురాలు సాడి పద్మారెడ్డి లేవనెత్తారు. మే 12న ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ, ఏయూ గ్రౌండ్స్‌లో మూడు షిఫ్టుల్లో 900 మంది ప్రైవేట్ కార్మికులను రోజువారీ వేతనం రూ. 549 చొప్పున నియమించడంపై ఆమె ప్రశ్నించారు. అసలు ఏయూ ప్రాంగణాల్లో జీవీఎంసీ పారిశుధ్య పనులను ఎందుకు నిర్వహించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఆమె ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, మేయర్ పీలా శ్రీనివాసరావు 'తర్వాత చర్చిద్దాం' అంటూ ఆ అంశాన్ని దాటవేశారు. దీంతో పద్మారెడ్డితో పాటు ఇతర సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఉత్తరాంధ్ర మైనార్టీ విద్యాభివృద్ధి డీడీగా ఖాజా రహమతుల్లా



మద్దిలపాలెం: ఉత్తరాంధ్ర ప్రాంతీయ మైనార్టీ విద్యా అభివృద్ధి డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా డాక్టర్ ఖాజా రహమతుల్లా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తరాంధ్ర మైనార్టీల విద్య, ఉద్యోగ శిక్షణకు సంబంధించిన కార్యక్రమాలను ఈ సంస్థ ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తుంది. ప్రస్తుతం ఆంధ్రా యూనివర్సిటీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న డాక్టర్ ఖాజా, వినియోగదారుల సంరక్షణ కమిటీ సభ్యుడిగా, గతంలో ప్రధానమంత్రి 15 అంశాల జిల్లా కమిటీ సభ్యుడిగా కూడా సేవలందించారు. ఈ పదవికి అవకాశం కల్పించినందుకు ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య రాంబాబు, పాఠశాల హెచ్ఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన

ఉద్యోగికి ఆరేళ్ల జైలు, రూ.60వేల జరిమానా

విశాఖ లీగల్: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉద్యోగికి ఆరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.60 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.ప్రదీప్ కుమార్ గురువారం తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో నిందితుడు అదనంగా నాలుగు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసు వివరాలను అదనపు సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ వెల్లడించారు. నిందితుడు, 30 ఏళ్ల డబ్బేరు సాయికుమార్ ఇండియా బీపీవో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గుమస్తాగా పనిచేసేవాడు. అతను కార్యాలయంలో పనిచేసే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా, వారిని వేధిస్తూ అభ్యంతరకరమైన ఈ-మెయిల్స్, మెసేజ్‌లు పంపేవాడు. ఈ విషయమై కార్యాలయ అధికారులు అంతర్గత విచారణ జరపగా, ఆరోపణలు నిజమని తేలింది. దీంతో 2024 ఏప్రిల్ 10న ఆ కంపెనీ పరిపాలనాధికారి మీసాల లోకేష్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సైబర్ క్రైం పోలీస్ అధికారి కె.భవానీ ప్రసాద్ ఈ కేసును దర్యాప్తు చేసి, నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 354(డి), సైబర్ క్రైం చట్టం 2000లోని సెక్షన్లు 66(సి)(డి), 67(ఎ) కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో, రెండు నేరాలకు గానూ నిందితుడికి ఒక్కో నేరంలో మూడేళ్ల చొప్పున జైలు శిక్ష, ఒక్కో నేరంలో రూ. 30 వేలు చొప్పున మొత్తం రూ.60వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే, ఒక్కో నేరంలో రెండు నెలల చొప్పున అదనపు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు.

పదేళ్ల తర్వాత యుద్ధ నౌకల పండగ

- వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ
- 2016 తర్వాత ఆతిథ్యమిస్తున్న భారత్
- విశాఖ కేంద్రంగా మరోసారి నిర్వహణకు సిద్ధం
- 145 దేశాలకు ఆహ్వానం పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ఇండియన్ నేవీ
- ఈసారి చైనాకు ఆహ్వానించే అంశంపై రక్షణ మంత్రిత్వ శాఖ చర్చలు



సాక్షి, విశాఖపట్నం : విశాఖ మరోసారి అంతర్జాతీయ కార్యక్రమానికి వేదిక కానుంది. 2026 ఫిబ్రవరిలో భారత నౌకాదళం అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్-2026 విన్యాసాలను నిర్వహించనుంది. దాదాపు పదేళ్ల తర్వాత విశాఖలో జరుగుతున్న ఈ యుద్ధ నౌకల ప్రదర్శన కోసం దాదాపు 145 దేశాలను ఆహ్వానించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయితే చైనాను ఆహ్వానించాలా వద్దా అనే విషయంపై ప్రస్తుతం రక్షణ మంత్రిత్వ శాఖలో చర్చలు జరుగుతున్నాయి. తూర్పు నావికాదళ ప్రధాన కేంద్రంగా ఉన్న విశాఖ.. గతంలో 2022లో ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్ విన్యాసాలను విజయవంతంగా నిర్వహించింది. అలాగే 2024లోనూ రికార్డు స్థాయిలో మిలాన్ విన్యాసాలు జరిగాయి. ఇప్పుడు ఈ అంతర్జాతీయ యుద్ధ నౌకల ప్రదర్శనతో విశాఖ ప్రాముఖ్యత మరింత పెరగనుంది.

ఏమిటీ ఫ్లీట్ రివ్యూ

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు సాగరంలో ఎదురుదాడికి దిగగల సత్తా చాటేందుకు నావికాదళ విన్యాసాలు ప్రపంచదేశాలకు చాటేందుకు నిర్దేశించినవే ఫ్లీట్ రివ్యూలు. భారత సుప్రీం కమాండర్ అయిన దేశాధ్యక్షుని సమక్షంలో ఈ విన్యాసాలు చోటు చేసుకుంటాయి. ఇప్పటికే భారత్ 2001లో ముంబైలోనూ 2016లో విశాఖలో ఐఎఫ్ఆర్‌ని నిర్వహించిన అనుభవం ఉంది. ఇప్పుడు మరోసారి అంతర్జాతీయ యుద్ధనౌకల విన్యాసాలకు వేదికగా విశాఖ నిలుస్తోంది. ప్రపంచానికే నాగరికత నేర్పిన దేశంలో తొలి టైడల్ డాక్‌ని భారత్ నిర్మించింది. చంద్రగుప్త కాలం నుంచే భారతీయులు సముద్రయానంపై మంచి పట్టు సాధించినట్లు చరిత్ర పేర్కొంటున్నది. నాటినుంచి నేటి అణుజలాంతర్గాముల నిర్మాణంలోనూ స్వయంచాలితంగా ఎదిగిన భారత్ ప్రపంచదేశాలను ఆకర్షిస్తూనే ఉంది. అంతర్జాతీయ యుద్ధనౌకల ప్రదర్శనతో మరోసారి ప్రపంచదేశాల దృష్టి విశాఖ తీరంవైపు సాగనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి 24 వరకూ ఐఎఫ్ఆర్‌తో పాటు మిలాన్-2026ని విశాఖలో నిర్వహించనున్నారు.

తొలిసారి 25.. మూడోసారి 145

2001లో భారత్‌లో తొలిసారి ముంబైలో ఐఎఫ్ఆర్ నిర్వహించిన సమయంలో 25 దేశాలు హాజరయ్యాయి. 2016లో విశాఖలో నిర్వహించినప్పుడు 51 దేశాలు హాజరయ్యాయి. 2025లో ఇండోనేషియాలోని బాలి సముద్ర తీరంలో ఐఎఫ్ఆర్‌లో 30 దేశాలు పాల్గొన్నాయి. ఈసారి మాత్రం రికార్డు స్థాయిలో 145 దేశాలకు ఆహ్వానం పంపించాలని భారత్ నిర్ణయించింది. ఈ మేరకు ఇండియన్ నేవీ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ.. ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఈ విన్యాసాల్లో భారత నావికా దళానికి చెందిన సర్ఫేస్ యుద్ధనౌకలు, జలాంతర్గాములతోపాటు నావల్ ఏవియేషన్ విమానాలు పాల్గొంటున్నాయి. ఢిల్లీ క్లాస్, రాజ్‌పుత్ క్లాస్, కమోర్తా క్లాస్, విశాఖ క్లాస్, శివాలిక్ క్లాస్, బ్రహ్మపుత్ర క్లాస్, నీలగిరి మొదలైన తరగతులకు చెందిన యుద్ధ నౌకలతో పాటు జలాంతర్గాములు, యుద్ధనౌకలకు అన్నివిధాల సహకారాన్ని అందించే ఫ్లీట్ టాంకర్లు, టార్పెడో రికవరీ వెసల్స్, గ్రీన్‌టగ్స్ సత్తా చాటనున్నాయి. అలాగే కోస్ట్ గార్డ్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) వంటి ఇతర సముద్ర సంస్థలకు చెందిన నౌకలు ఈ ఫ్లీట్ రివ్యూలో భాగస్వామ్యం కానున్నాయి.

చైనాని పిలవాలా.. వద్దా.?

ఇటీవల చైనాతో చర్చలు జరిగిన నేపథ్యంలో..ఐఎఫ్ఆర్‌కు చైనాను ఆహ్వానించాలా వద్దా అనే అంశంపై రక్షణ మంత్రిత్వ శాఖ ప్రత్యేక చర్చలు జరుపుతోంది. 2016లో నిర్వహించిన ఐఎఫ్ఆర్‌కు చైనాని ఆహ్వానించగా రెండు యుద్ధ నౌకలు, ఓ జలాంతర్గామి విన్యాసాల్లో పాలుపంచుకున్నాయి. ఈసారి ఆహ్వానం అందించాలా వద్దా అనే దానిపై త్వరలోనే స్పష్టత వస్తోందని నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఇప్పటి వరకూ భారత్‌లో జరిగే ఏ విన్యాసాలకు పాక్‌ని ఆహ్వానించలేదు. రాబోతున్న ఐఎఫ్ఆర్, మిలాన్-2026కి కూడా ఆహ్వానం లేదని రక్షణ వర్గాలు తెగేసి చెబుతున్నాయి. ఆసియా, ఐరోపా, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆఫ్రికా ఖండాలకు చెందిన దేశాలు ఐఎఫ్ఆర్‌లో భాగస్వామ్యం కాబోతున్నాయి.

నేడు డీఎస్ఎన్ఎల్‌యూ స్నాతకోత్సవం

హాజరుకానున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

ఏయూ క్యాంపస్ : దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) సంయుక్త స్నాతకోత్సవం శుక్రవారం జరగనుంది. నోవాటెల్ హోటల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ గౌరవ అతిథిగా, వర్సిటీ మాజీ చాన్సలర్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి ప్రత్యేక అతిథిగా హాజరవుతారు. వర్సిటీ చాన్సలర్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహిస్తారు. ఒకే వేదికపై 8వ, 9వ, 10వ, 11వ, 12వ స్నాతకోత్సవాలను నిర్వహిస్తున్నారు.

ఇందులో 900 మందికిపైగా పట్టాలను అందుకోనున్నట్లు వీసీ ఆచార్య డి.సూర్యప్రకాశరావు తెలిపారు. స్నాతకోత్సవం అనంతరం సబ్బవరంలోని వర్సిటీ ప్రాంగణంలో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అకడమిక్ బ్లాక్-2 భవనాలను జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రారంభిస్తారు. అలాగే వర్సిటీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, మహాత్మా గాంధీ, దామోదరం సంజీవయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తారు.

క్లుప్తంగా

కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మహిళలతో మాట్లాడుతున్న మేరీ సువార్త

అనకాపల్లి: కుటుంబ అభివృద్ధిలో మహిళలు పాత్ర కీలకమైనదని, అన్ని రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉండేందుకు కృషి చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ నోడల్ అధికారి మేరీ సువార్త అన్నారు. స్థానిక న్యూకాలనీ వద్ద స్పందన స్ఫూర్తి రూరల్ డెవలప్‌మెంటు అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ ప్యాకింగ్ శిక్షణ తరగతుల్లో గురువారం ఆమె మాట్లాడారు. మహిళలు స్వయంశక్తిపై ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాములమ్మ మాట్లాడుతూ స్త్రీల బలాన్ని బాధ్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి, సొసైటీ అధ్యక్షురాలు విశాలాక్షి, కార్యదర్శి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బీవీఎస్ వర్మకు ఘన సత్కారం



బీవీఎస్ వర్మను సత్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరావు

అనకాపల్లి టౌన్: భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం సేవలందించిన రాంబిల్లి గ్రామానికి చెందిన బీవీఎస్ వర్మ ఏపీ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ స్టేట్ డైరెక్టర్‌గా నియమితులు కావడంపై జిల్లా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో బీవీఎస్ వర్మను పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లికి ఘన నివాళి



బాలికల నృత్య ప్రదర్శన

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూలులో గురువారం ముందస్తుగా గురు పూజోత్సవాన్ని నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం నృత్యాలు, నాటికను ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకున్నారు. స్కూలు డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్, కరస్పాండెంట్ అనూరాధ, ప్రిన్సిపాల్ రూపనంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 76 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	4,700
రెండో రకం	3,700	4,100
మూడో రకం	3,460	3,630

అనకాపల్లి సినిమాలు

రాజా
:మదరాసి
సత్యనారాయణ స్క్రీన్-1:కొత్తలోక
సత్యనారాయణ స్క్రీన్-2: థి కంజరింగ్ 4 లాస్ట్ రైట్స్
పర్తిసాయి : ఘాటీ
షిర్డీసాయి : కూలీ
వెంకటేశ్వర : లిటిల్ హర్ట్స్
రామచంద్ర : వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6, బీ పాజిటివ్-16, ఓ పాజిటివ్-31, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 394 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 361 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

శ్రీసత్యలో బార్ అండ్ రెస్టారెంట్

త్వరలో విడుదల

మీ అభిమాన థియేటర్లో చూడండి..
రాయల్ బార్ అండ్ రెస్టారెంట్..
త్వరలో విడుదల..
ఇదేంటి కొత్త సినిమా అనుకుంటున్నారా..
అలాగైతే తప్పులో కాలేసినట్టే..

మూడు రోజుల క్రితం వరకు ప్రేక్షకులను అలరించిన అనకాపల్లిలో శ్రీసత్య థియేటర్ ఇకనుంచి బార్ అండ్ రెస్టారెంట్‌గా మారనుంది. కూటమి పాలనలో మద్యం అమ్మకాలకు బార్లా తెరవడంతో అధికార పార్టీ నాయకులు సొమ్ము చేసుకోవడానికి థియేటర్‌ను బార్‌గా మార్చేస్తున్నారు.



సత్య థియేటర్‌లో కొత్తగా బార్ అండ్ రెస్టారెంట్‌కు ఏర్పాటు చేసిన బోర్డు

- మద్యం కేంద్రంగా మారిన థియేటర్
- బోర్డు దర్శనమివ్వడంతో ప్రేక్షకులు అవాక్కు
- గుడి, బడికి కూత వేటు దూరంలో ఏర్పాటు
- ప్రజల నుంచి విమర్శల వెల్లువ



వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయం

అనకాపల్లి: ఇటీవల తమ అభిమాన హీరో సినిమా చూసేందుకు వెళ్లిన ప్రేక్షకులకు థియేటర్ గేటుకు రాయల్ రెస్టారెంట్ అండ్ బార్ బోర్డు దర్శనమివ్వడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తాము వచ్చింది థియేటర్‌కేనా అని కొంతసేపు గందరగోళానికి గురయ్యారు. కాసేటికి తేరుకుని తామొచ్చింది థియేటర్‌కే అనుకుని పక్కవారిని ఆరా తీయగా, మూడు రోజుల నుంచి థియేటర్ మూతపడిందని చెప్పడంతో నిరాశతో వెనుతిరిగారు. ఇది అనకాపల్లి శ్రీసత్య థియేటర్‌కు వెళ్తున్న ప్రేక్షకుల పరిస్థితి.

అధికార పార్టీ నేతలు సొమ్ము చేసుకోవడానికే

అనకాపల్లి మెయిన్‌రోడ్డులో సత్య థియేటర్ 50 సంవత్సరాలు క్రితం ఏర్పాటు చేసి అనేక సినిమాలు ప్రదర్శించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం బార్ల అనుమతులకు బార్లా తెరవడంతో అధికార పార్టీ నేతలు సొమ్ము చేసుకోవడానికి ఎక్కడా రెస్టారెంట్ పెట్టడానికి దుకాణాలు రెంట్‌కు లభించలేదు. దాంతో మూడు రోజులు క్రితం థియేటర్‌ను మూసివేశారు. ఈ స్థానంలో బార్ అండ్ రెస్టారెంట్ బోర్డును ఏర్పాటు చేయడంలో ఇక్కడికి వచ్చే ప్రేక్షకులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఈ నేపథ్యంలో జనసంచార ప్రాంతాల్లో బార్ అండ్ రెస్టారెంట్‌లు నిర్వహించడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది.



బార్ అండ్ రెస్టారెంట్ గోడకు ఆనుకుని ట్రాఫిక్, మహిళా, సీసీఎస్ పోలీస్ స్టేషన్లు

ఎదురుగా రెండు హైస్కూళ్లు

కొత్తగా ఏర్పాటు చేసే బార్ అండ్ రెస్టారెంట్‌కు ఎదురుగా వంద మీటర్ల దూరంలో జీవీఎంసీ టౌన్ బాలికోన్నత హైస్కూల్, జీవీఎంసీ పెద్ద హైస్కూల్ ఉన్నాయి. టౌన్ బాలికోన్నత హైస్కూల్ ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఈ రెండింట్లో విద్యార్థినులు, చిన్నారులు చదువుకుంటున్నారు. బాలికోన్నత పాఠశాలకు అనకాపల్లి మండలం రేబాక, కొప్పాక, సత్యనారాయణపురం, మూలపేట గ్రామాలకు చెందిన 6 నుంచి 10వ తరగతి విద్యార్థినులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. మెయిన్‌రోడ్డులో పెద్ద హైస్కూల్‌కు విద్యార్థులు వచ్చి చదువుతున్నారు.



కొత్తగా ఏర్పాటు చేసే బార్ అండ్ రెస్టారెంట్ వద్ద బాలికోన్నత హైస్కూల్

ఈ రెండు స్కూళ్లో 1800 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ముఖ్యంగా విద్యార్థినులకు జరగరానిది ఏదైనా జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

థియేటర్ పక్కన పోలీసు స్టేషన్లు...

థియేటర్‌కు సమీపంలోనే ఆలయాలు, పాఠశాలలు కొత్తగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేసే థియేటర్‌ను ఆనుకుని ట్రాఫిక్, మహిళా, సీసీఎస్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఇక్కడ మహిళా పోలీస్ స్టేషన్‌కు జిల్లాలో వివిధ కేసులకు సంబంధించిన వ్యక్తులు నిత్యం వస్తుంటారు. వీటికితోడు థియేటర్‌కు ఎదురుగా వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయం ఉంది. ఇక్కడ అమ్మవారి ఆలయానికి నిత్యం వందలాది మంది భక్తులు వస్తుంటారు. ఏటా జనవరిలో 3 లక్షల మంది భక్తులు హాజరయ్యే అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుతో మందుబాబులు మద్యం మత్తులో గొడవలు సృష్టించే ప్రమాదముందని ఆందోళన వ్యక్తమవుతోంది.

నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం...

కొత్తగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేసినట్లయితే ప్రధానంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారు. వారు మద్యానికి అలవాటుపడి తప్పుదోవ పడే ప్రమాదముంది. దీనికితోడు గౌరీపరమేశ్వరుల ఆలయానికి వచ్చే భక్తులకు, పోలీస్ స్టేషన్‌కు వివిధ పనులపై వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పవు. ప్రజలు తాగి బానిస కావడానికే దీన్ని ఏర్పాటు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

గుడి, బడి వద్ద బార్ అండ్ రెస్టారెంట్ వద్దు



గుడి, బడి వద్ద బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు తప్పవు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రభుత్వం దీని ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం తగదు. మరోసారి పునరాలోచన చేయాలి.

–వి.గణేష్, అనకాపల్లి

ప్రజలకు ఇబ్బందే..



మహిళలకు రక్షణ కల్పించే మహిళా పోలీస్ స్టేషన్ పక్కనే బార్ అండ్ రెస్టారెంట్‌కు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం దారుణం. కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదనడానిక ఇదే నిదర్శనం. బాలికోన్నత హైస్కూల్లో విద్యార్థినులు చదువుతున్నారు. పక్కనే ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలు జరుగుతాయి. దాంతో బార్ అండ్ రెస్టారెంట్‌కు వచ్చే వారితో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతుంది. క్రైం రేటు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

–కోన లక్ష్మణ్, అనకాపల్లి.

నేడు సిద్ధి బుద్ధి గణపతి కల్యాణం

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని కన్యకాపర**మేశ్వరి ఆలయ** ఆవరణలో వినాయక నవరాత్ర**లను పురస్కరించు**కుని శుక్రవారం ఉదయం 9 గం**టలకు సిద్ధి బుద్ధి** గణపతి కల్యాణాన్ని నిర్వహి**స్తున్నట్లు ఆలయ** ప్రతినిధి కటకం లక్ష్మణరావు **గురువారం ఒక** ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయా**నికి వచ్చే భక్తులకు** మధ్యాహ్నం భారీ అన్నసమారా**ధన, సాయంత్రం** 6 గంటలకు బొండాడ ప్రమీల ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈద్-మిలాద్-ఉన్-నబీకి సన్నాహాలు

కశింకోట: మండలంలో ముస్లింలు ఈద్-మిలాద్-ఉన్-నబీ (మహ్మద్ ప్రవక్త) జయంతి శుక్రవారం నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా బయ్యవరం నుంచి కశింకోట వరకు సంప్రదాయంగా ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జామియా, నూరి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. నరసింగబిల్లిలోని మసీదులో మహ్మద్ ప్రవక్త జయంతి కార్యక్రమాన్ని జరుపుతామన్నారు.

ఎస్ఐ రమేష్‌కు సీఐగా పదోన్నతి



రమేష్‌ను అభినందిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: స్థానిక సీసీఎస్ ఎస్ఐ పిళ్లా రమేష్‌కు సీఐగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఎస్పీ తుహీన్‌సిన్హాను గురువారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదోన్నతికి అనుగుణంగా షోల్డర్‌పై అదనపు స్టార్‌ను అలంకరించి రమేష్‌కు అభినందనలు తెలిపారు. మరింత బాధ్యతగా సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

జిల్లా ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక



దాడి కాళిదాసు

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలులో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న జిల్లా సైన్స్ అధికారి దాడి కాళిదాసుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం లభించింది. అనకాపల్లిలో శుక్రవారం జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్, తదితరుల నుంచి పురస్కారం అందుకోనున్నారు.

ఆవఖండం భూములకు మూసుకుపోయిన దారులు

- రియల్ ఎస్టేట్ వ్యాపారాల వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు

అనకాపల్లి: రియల్ ఎస్టేట్ వ్యాపారుల కారణంగా జాతీయ రహదారి ఆవఖండం సౌత్-1, 2లో 1100 ఎకరాల్లో రైతులు పంట తీసుకుని వచ్చే దారులు మూసుకుని పోయే పరిస్థితులు నెలకొన్నాయని అనకాపల్లి రైతు సంఘం నాయకుడు సూరిశెట్టి రమణఅప్పారావు, పులికాలువ డైరెక్టర్లు పిల్లా కొండయ్య సూరిశెట్టి ఈశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద నీటిపారుదల శాఖ ఏఈ రూపాదేవికి గురువారం వారు వినతిపత్రం అందజేశారు. బ్రిటిష్ కాలం నుంచి రైతులు ఆవఖండంలో వరి, పశుగ్రాసాన్ని ట్రాక్టర్ల ద్వారా రహదారిపైకి తీసుకువచ్చేవారన్నారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్స్ వేయడంతో దారులు మూసుకుపోవడంతో ట్రాక్టర్లు తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రైతులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వారికి అనుమతులు ఇచ్చే సమయంలో కాలువలకు ఇరువైపులా సెట్‌బాక్స్ వదిలే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై వీఎంఆర్‌డీఏ స్పందించి రానున్న రోజుల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నీటిపారుదల శాఖ ఏఈ రూపాదేవికి వినతిపత్రం అందజేస్తున్న రమణఅప్పారావు

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ వ్యక్తిని అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలియరాలేదు. మృతుడి వివరాలు తెలిసిన వారు పరవాడ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ కోరారు.

11 టన్నుల యూరియా సిద్ధం

కశింకోట: మండలంలో 11 టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల ప్రత్యేకాధికారి సుభాషిణి, మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న గురువారం తెలిపారు. ఇప్పటికే వరి, చెరకు పంటలకు 498 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. మరో 60 టన్నులు యూరియా అవసరం ఉన్న మేరకు ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే రానుందన్నారు. మండలంలో 640 హెక్టార్లలో వరి, 415 హెక్టార్లలో చెరకు వేశారన్నారు. రైతుల కోసం కశింకోటలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. 8328470885, 8985882393లను సంప్రదించవచ్చునన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో వీఆర్వో, మహిళా సంరక్షణ కార్యదర్శి, గ్రామ వ్యవసాయ, ఉద్యాన వన సహాయకులను నియమించామన్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద గ్రామ సహాయకులను పర్యవేక్షణకు నియమించామన్నారు. రోజూ మండల కమిటీగా తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ, వ్యవసాయ అధికారుల బృందం ప్రైవేటు డీలర్ల స్టాక్ పాయింట్లను తనిఖీ నిర్వహించి జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ విజయకృష్ణన్ మండల స్థాయి అధికారులు, వ్యవసాయ సహాయకులు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో జూం సమావేశం నిర్వహించి రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారన్నారు. వరి, చెరకు పంటలకు యూరియాను అందించాలని, ఇతర పంటలకు ప్రైవేటు డీలర్లు విక్రయిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



ఎరువుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు



తాళ్లపాలెం దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో

అనకాపల్లి టౌన్: ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక రేటుకు అమ్మితే క్రిమినల్ కేసులు పెడతామని విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ కె. రమణమణి హెచ్చరించారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆమె గురువారం తనిఖీ చేశారు. పురుగు మందులు, ఎరువుల డీలర్లు స్టాక్ బుక్స్ తప్పనిసరిగా మెయిన్‌టెన్స్ చేయాలన్నారు. విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్ మాట్లాడుతూ డబ్బులు తీసుకొని యూరియా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న డీలర్‌పై చీటింగ్ కేసు నమోదు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ అధికంగా యూరియా నిల్వలు ఉంచినా వారి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ టీం సభ్యులు డిప్యూటీ ఎమ్మార్వో డి. శాంతి భూషన్, ఎంపీడీవో, విజిలెన్స్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, గొడౌన్‌లోని ఎరువులను తనిఖీ చేశారు. రికార్డుల మేరకు ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతులకు యూరియా, ఇతర ఎరువులు అందివ్వాలని డీలర్‌ను ఆదేశించారు. డీలర్ సుందరం కార్యక్రమంలో పాల్గొన్నారు.

దివ్యాంగ ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరం రేపు

పరవాడ: పాఠశాల విద్యాశాఖ సమగ్రశిక్ష, ఆలిమ్‌కో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉదయం 9 గంటలకు అనకాపల్లి మున్సిపల్ బాలికల పాఠశాలలో 0 నుంచి 18 ఏళ్ల వయస్సు గల దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంఈవో దివాకరరావు తెలిపారు. శిబిరంలో కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాలకు సంబంధించిన దివ్యాంగ విద్యార్థులు పాల్గొనాలని కోరారు. దివ్యాంగ విద్యార్థులకు వైద్య నిర్ధారణ పరీక్షల అనంతరం ఉచితంగా ఉపకరణాలను అందించనున్నట్లు తెలిపారు.

వినాయకుని వద్ద దీపార్చన



సాయినగర్‌లో వినాయకుని వద్ద దీపార్చన

కశింకోట: స్థానిక గవరపేట పెద గుమ్మం వీధి దుర్గమాంబ ఆలయంలో నెలకొల్పిన వినాయకునికి నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం పాట వేశారు. ఇక్కడి సాయినగర్‌లోని వినాయకుని వద్ద దీపార్చన నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు.



గవరపేటలో అన్న సమారాధన

అప్పన్న తొలిపావంచా పరిసరాల సుందరీకరణ

- జీవీఎంసీ నిధులు రూ.2 కోట్లతో పనులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ తొలిపావంచా పరిసరాలు త్వరలోనే కొత్త రూపుని సంతరించుకోనున్నాయి. జీవీఎంసీ నిధులు రూ.2 కోట్లతో ఆయా ప్రాంతాల్లో సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు జీవీఎంసీ జోన్-8 అధికారులు, సింహాచలం దేవస్థానం అధికారులు గురువారం సమావేశమై, సంబంధిత పనులపై చర్చించారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న నిధులతో ఏయే పనులు చేస్తామో జీవీఎంసీ అధికారులు దేవస్థాన సిబ్బందికి వివరించారు. ప్రధానంగా కొండ దిగువ ట్రాన్స్‌పోర్టు బస్టాండ్ ఏరియాని అభివృద్ధి చేసి, బస్‌బేలు ఏర్పాటు చేస్తామన్నారు. కొత్త తొలిపావంచా ఎదురుగా రోడ్డుపై విద్యుద్దీపాలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు పెంచనున్నట్లు తెలిపారు. కారు స్టాండ్ సమీపంలో శంఖు చక్ర నామాలు, సింహాచలం పేరుతో లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. హవేలి ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రం చేసి, కారు పార్కింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాలపై దేవస్థానం అధికారులు సమ్మతించారు. జోన్-8 జెడ్సీ హేమావతి, ఈఈ దిలీప్, డీఈ ప్రవీణ్‌కుమార్, దేవస్థానం ఈఈ రామకృష్ణ, ఏఈవో రమణమూర్తి, ఏఈలు పాల్గొన్నారు.